# 37. పంజాబ్ కేసరి పెళ్ళి

"పంజాబ్ కేసరిగా" సుప్రసిద్ధులైన మహారాజా రంజిత్‌సింహజీ వారు 1796లో శాస్త్రోక్తంగా కళ్యాణ మహోత్సవం జరిపించుకుని బ్రహ్మచర్యానికి అధికారికంగా అంత్యక్రియలు జరిపించి ఉన్నారు.

ఆ మహోత్సవం జరిగిన తర్వాత అక్షరాలా ముప్ఫయితొమ్మిది సంవత్సరాలకు మహారాజావారు తన ఆఖరి వివాహ మహోత్సవాన్ని అంతకన్నా ఘనంగా శాస్త్రోక్తంగా సర్వుల సమక్షంలోనూ జరిపించుకున్నారు.

ఈ మధ్య కాలంలో శ్రీవారు ఏం చేస్తున్నారూ ? అనే ప్రశ్నే లేదు దామాషాన నాలుగేండ్ల కొకటి చొప్పున పది పెండ్డిండ్లు జరిపించుకొని పదిమంది దేవేరులనూ తెచ్చుకుని ఇహలోక సుఖాలన్నింటినీ తాపీగా అనుభవిస్తూ ఉన్నారు.

మహారాజావారి తర్వాత గద్దెనెక్కిన శ్రీవారి వంశోద్ధారకుడు దలీప్‌సింగ్ లెక్కల ప్రకారం మహారాజావారికి అక్షరాలా నలభయ్యారుగురు రాణులున్నారు. శాస్త్రోక్తంగా పెండ్లిడ్లు జరిగింది పన్నెండు సార్లే గదా, మరి 46 గురు రాణులెలా వచ్చారూ అనే సందేహాలకు ఈ పవిత్ర భారతంలో అవకాశం లేదు. గాంధర్వ వివాహాలు, రాక్షస వివాహాలు ఆదిగాగల రాచమార్గాలు మన శాస్త్రాలు ఏనాడో ఇలాంటి ధర్మాత్ముల కొరకే నిర్దేశించి ఉన్నాయి.

★

అందునా మహారాజా రంజిత్‌సింహజీవారు సకల శాస్త్రసారాన్నీ, మత ధర్మాల సూక్ష్మాన్నీ జీర్ణం చేసుకునిఉన్న మహానుభావులు. కుల, మత, జాతి విచక్షణ లేకుండా సిక్కు, డోగ్రా, కాశ్మీరీ మున్నగుజాతుల సుందరాంగులనే గాక సాధారణంగా సిక్కులకు అంటరాని వారయిన ముస్లిం కన్యలను సైతం వచ్చిన వారిని వదలకుండా అక్కున చేర్చి ఆ తర్వాత రాణులుగా వారికి ప్రమోషన్లు ఇచ్చివేశారు.

వివిధ మతాలు, జాతులకు చెందిన సుందరాంగులతో శ్రీవారి రాణి వాసం ఓ సెక్యులర్ స్టేట్‌లా, ఆధునిక భారతంలా వర్ధిల్లుతూ ఉండేది. మత విషయాల్లో శ్రీవారు బహు ఉదారులూ సమదృష్టిగలవారూను. ఏ మతానికి చెందిన రాణులు ఆయా మత సాంప్రదాయాలూ, పండుగలూ వేడుకలూ జరుపుకునే విషయంలో శ్రీవారు సంపూర్ణ స్వేచ్ఛను ప్రసా దించిఉన్నారు. దసరా, దీపావళివంటి పండుగలతోపాటు ఈద్, బైశాఖి నౌరోజ్‌వంటి పండుగలు కూడా సంస్థానంలో సెలవు దినాలే. మసీదు లకు ముస్లిం మతసంస్థలకు విరివిగా భూరి విరాళాల నివ్వటమే గాకుండా ఉర్దూ భాషను ప్రోత్సహించి పర్షియన్ భాషను అధికార భాషగా నిలబెట్టారు.

ఓసారి మహారాజా రంజిత్‌సింహజీవారు పొరుగువారైన ముల్తాన్ సంస్థానాధీశుల ఆహ్వానంపై వారి అతిథిగావెళ్ళి ఉన్నారు. అక్కడ ఉం డగా శ్రీవారి గౌరవార్థం జరిగిన అనేకానేక "సాంస్కృతిక" కార్యక్ర మాల్లో ఒకదాంట్లో అప్సరసల్ని తలదన్నగల ఓ మొగల్ సుందరి నృత్య ప్రదర్శననుచూసి శ్రీవారు నిజంగానే మూర్ఛపోయేరు. ఆతర్వాత వాకబు చేయగా తేలిందేమంటే సదరు అప్సరస ముల్తాన్ వేశ్యావాటిక ల్లోని వందలాది మందిలో ఒకత్తె అని.

అయినా శ్రీవారు చలించలేదు.

"అయితేనేం గాక ! మాకా పట్టింపులేంలేవు" అని ఉద్ఘాటించారు. తక్షణం సదరు సుందరాంగిని లాహోర్‌లోని తన రాణీవాసంలో ప్రవేశ పెట్టవలసిందిగా అంతరంగికులను ఆదేశించారు.

వారున్నూ శ్రీవారి ఆజ్ఞను అమలు పర్చేరు.

ఆ సుందరి పేరు మొరాన్, అంటే అర్థం ఆడ నెమిలి అని.

సదరు ఆడనెమిలిని మన మగరంజిత్‌సింహజీ నెమిలిగారు శాస్త్రోక్తంగా వివాహమాడి ఏం చేసేరూ...?

ఆవిడ గౌరవార్థం నెమిలి చిహ్నంతో సహా ఓ బంగారునాణాన్ని రాజావారి టంకశాలలో ముద్రింపించి సంస్థానంలో విడుదల చేయించేరు.

ఆ విధంగా ఆవిడపట్లగల ప్రేమను ఘనంగా ప్రకటించారు. ఆ తర్వాత శ్రీవారు శ్రీమతితో కలిసివెళ్ళి అమృతసర్ స్వర్ణదేవాలయం, హరిద్వార్ ఆదిగాగల పుణ్యక్షేత్రాలన్నింటినీ ఆవిడచేత పావనం చేయించారు.

హిమాచల సానువుల్లో వారిరువురూ ఓసారి మైమరచి ఉండగా సదరు నెమిలి ప్రశ్నించింది. "మహారాజా తమరలా ఉన్నారేమీ? దేవుడు అందాన్ని అందరికి పంచిపెడుతున్నపుడు మీ రెక్కడున్నారూ ?" అని.

"అప్పుడు నేను కావలసినంత అందాన్ని అందివ్వగల రాజ్యం కోసం పోరాటాల్లో మునిగి ఉన్నాను ప్రియా" అన్నారట రాజావారు.

సదరు ఆడనెమిలి రాజావారి కోసం అడి, పాడి, క్రీడించి అత్యల్ప కాలంలోనే స్వర్గానికి వెళ్ళిపోయింది.

"మోరాన్ నా ప్రాణం" అన్న మహారాజా రంజిత్‌సింహజీవారు అప్పుడేంచేశారూ ?

ఏడాది తిరక్కముందే నెమలిని మరచి మరో గులాబిని ఆఘ్రాణించసాగారు. గుల్‌బేగం అనే ఓ ముస్లిం నర్తకిని మోహించి శాస్త్రోక్తంగా వివాహమాడి ఈ సారి ఈవిడ గౌరవార్థం ఆవిడతో కలిసి ఏనుగెక్కి లాహోర్‌లో ఊరేగారు.

★